

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 66

## ఉచిత భోజనం

పి హెచ్ డి పూర్తి అవడానికి ఆరునెలల ముందు ప్రొఫెసర్ పిలిచి చెప్పాడు శాస్త్రికి.

"కొత్తగా అప్లికేషన్ పెట్టారు కదా ఆ మధ్యన ఫండింగ్ కి? అది వచ్చే ఛాన్సు ఉంది."

శాస్త్రి ఇక్కడే ఉంటే అందులో పోస్ట్ డాక్టరల్ గా మూడేళ్ళు చేసాక అదే డిపార్ట్ మెంట్లో ఉద్యోగానికి సులభం. అది రాకపోతే కనీసం పోస్ట్ డాక్టరల్ అవుతుంది కనక మరోచోట ఉద్యోగం రావొచ్చు.

శాస్త్రి ఒప్పుకున్నా ఓ విషయం అడిగాడు

" గ్రీన్ కార్డ్ కి కుదురుతుందా ఈ పోస్ట్ డాక్టరల్ ఉద్యోగంలో?"

దాదాపు కుదురుతుంది అని విన్నాక మూడు వారాల శెలవులో ఇండియా వెళ్ళి పట్టాభిషేకం చేయించుకుని వచ్చాడు. అంతకు ముందు ఉన్న రూమ్మేట్లని వదిలేసి వేరే కొత్త అపార్ట్ మెంట్లో కాపురం. కానీ స్టూడెంట్ స్నేహితులు ఎప్పటిలాగానే ఉన్నారు, కబుర్లకీ వీకెండ్ పార్టీలకి. రోజులు గడుస్తూంటే కొత్తగా వచ్చే కుర్రాళ్ళు వస్తున్నారు. గ్రాడ్యుయేట్ అయినవారు ఉద్యోగాలకి వెళ్తున్నారు. అలా కొత్తగా వచ్చిన కుర్రాడు, రాకేష్ కుమార్ శాస్త్రికి పరిచయం అయ్యాడు –

యూనివర్సిటీ లో జరిగే 'ఇండియా డే' అనే పండుగనాడు. కొత్తగా వచ్చిన కుర్రాళ్ళకి ఎప్పుడైనా సహాయం కావలిస్తే ఇండియా స్టోర్ కి తీసుకెళ్ళడమో శాస్త్రి తనకి చేతనైనంతలో చేయగలుగుతున్నాడు, ఈ జీతం లేని పనికి కొత్తగా వచ్చిన భార్య కొంచెం అప్పుడప్పుడు అలిగినా, ప్రతీవారం ఈ పని తగులుతూ ఉంటే, ఈ దరిద్రం ఎప్పుడు వదులుతుందా అని ఆవిడ అరుస్తూనే ఉంది.

స్టూడెంట్ గా ఉన్న రోజుల్లో శాస్త్రి గమనించిన విషయం మరొకటుంది. కారున్న కుర్రాడు అది లేని మిగతావారిని కూడా గుడికో మరోచోటికో తీసుకెళ్ళడం 'సాధారణ రివాజు' కనక అందరూ పోలోమంటూ పోవడం. గుడి యూనివర్సిటీకి దూరం కనక వెళ్ళి వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటుతుంది. గుడిలో జనం లేనప్పుడు పూజారి గారు ఏపిల్ లేదా అర్టిపండు ప్రసాదం గా ఇస్తే, పూజారి మిగతావారికి ప్రసాదం ఇస్తూండగానే, ఇంకా గుడిలోంచి బయటకి రాకుండానే దాన్ని అక్కడే సగం కొరికి తినడం. ఇది వింత అయినా శాస్త్రి మాత్రం తన ప్రసాదం చేత్తో పట్టుకుని బయటకి వచ్చాక అది కార్లో ఓ చోట పెట్టేసరికి అది మాయం.

ఇలా రెండు మూడు సార్లు జరిగాక శాస్త్రి అడిగాడు కూడా ఉన్నవారిని

"ఇక్కడ ఏపిల్ పెట్టానండి మీరు చూసారా?" అని.

అప్పుడో ప్రబుద్ధుడు చెప్పిన విషయం ఇది

" ఆ ఏపిల్ నాది. నేను తినేసాను"

అయితే పండుగ రోజుల్లో అందరూ తెచ్చిన తలో పదార్ధం డిన్నర్ గా పెట్టాక కూడా ఈ ఏపిల్, అరటిపళ్ళు మాయం అవుతున్నాయి. చిన్న విషయాలకి బుర్ర పాడుచేసుకోకుండా శాస్త్రి ఊరుకున్నాడు. ఉత్తరోత్తరా తెల్సిన విషయాలు మరింత విస్మయం కలిగించేయి.

గుడికి వెళ్ళి వెనక్కి వచ్చేసరికి తొమ్మిది దాటుతుంది కనక ఈ స్టూడెంట్లలో ఎవరికీ వంట చేసుకునే, కనీసం అన్నం వండుకునే ఓపికా, తీరికా లేవు. గుడిలో తినడానికి ఏదో పెట్టకపోతే పస్తు ఉండాలి కనక అక్కడిచ్చిన పండు ఒకటే తిని ఆకలి ఓర్చుకోవాలి. ఒకటి చాలకపోతే పక్కనే ఉన్నవారిది తినేసి అది నాదే అని చెప్పడమే. అయితే గుడిలోంచి బయటకి రాకుండానే ఏపిల్ కొరకడం ఎందుకు? అది కొరకకపోతే మరొకరెవరో తినేయవచ్చు అందువల్ల ముందే ఏపిల్ ని గుడిలోపలే కొరికేస్తే ఎవరూ ముట్టుకోరు, దాన్ని తర్వాత ఎక్కడ పెట్టినా.

ఇదంతా తెలిసాక శాస్త్రి అసహ్యించుకున్నాడు. పెళ్ళయ్యాక భార్య కూడా ఉంది కనక గుడికి వెళ్ళేటప్పుడు మాత్రం ఇప్పుడెవరూ కారులో శాస్త్రి కూడా రారు, బావుండదని. అందువల్ల శాస్త్రికి ఇటువంటి లేకి కధలు వినే దరిద్రం తప్పినా పూర్తిగా పోలేదు.

పెళ్ళైయ్యాక శాస్త్రి గుడికి ఏ పండగకో వెళ్తే ఏదో ఒక పులిహోరలాంటిది చేయించి పట్టుకెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. గుడిలోపల భార్య పక్కన ఉన్నప్పుడు ఎవరూ పలకరించకపోయినా ఆవిడ దూరంగా జరిగినపుడో ప్రదక్షిణం చేస్తున్నప్పుడో ఎవరో కుర్రాడు పలకరించడం, ఏవో పాత కబుర్లు చెప్పడం అలవాటు. అలా దసరాలో విజయదశమి నాడు తాము పట్టుకెళ్ళిన ప్రసాదం గుడిలో ఇచ్చి పూజ చూస్తున్నప్పుడు ఈ రాకేష్ కుమార్ పలకరించాడు. హలో అనడం లేదు, మరోటీ లేదు గానీ మొదలుపెడుతూనే అడిగాడు,

"ఏమండీ ఈ పూజ అయ్యాక డిన్నర్ పెడతారా?"

ఛెళ్ళున మొహంమీద కొరడాతో కొట్టినట్టైంది శాస్త్రికి. గుడిలో ఎవరూ వంటవాడు ఉండడనేది జగద్విదితం. అందరూ పట్టుకొచ్చిన పదార్థాలు తలో కాస్త ప్లేటులో పెట్టి ఇస్తారు. ఆ ప్లేట్లూ, స్పూన్ లూ కూడా మరొక కుటుంబం ఇస్తుంది ఉదారంగా. "డిన్నర్" అనే ప్రశ్నే రాకూడదు. ఎందుకంటే ఎవరెంత పట్టుకొచ్చారు, ఎంతమంది గుడికి వచ్చారు అనే దాన్ని బట్టి అసలు మన ప్లేట్లో స్పూన్ కి సరిపడా ప్రసాదం ఉందా లేక ఒక అరటిపండు మాత్రం మనకి దక్కిందా అనేది ఉంటుంది. అసలు దీన్ని గురించి పట్టించుకోవడమే ఓ పెద్ద ప్రహసనమా? శాస్త్రి పక్కకి తిరిగి చెప్పాడు రాకేష్ తో

"గుడిలో డిన్నర్ అంటూ ఉండదు, అందరూ పట్టుకొచ్చిన ప్రసాదం పంచుతారు."

అక్కడితో పోయిందనుకున్న శాస్త్రికి మరో కొరడా దెబ్బ తగిలింది రాకేష్ నుంచి –

'ఇప్పుడు పూజంతా అయ్యాక డిన్నర్ తినకపోతే నేను ఓర్చుకోలేనండి. మీరే చెప్పాలి ఎలాగోలాగ."

దీనికి వళ్ళు మండినా సమాధానం చెప్పాడు శాస్త్రి,

"ఏమీ పెట్టకపోతే ఏపిల్ లేదా అరటిపండు ఇస్తారు కదా, ఓ పూటకి అది చాలదా?"

దీనికి మరో చెంప పెట్టు సమాధానం వచ్చింది,

"అమ్మబాబోయ్, అది నాకు చాలదు, పూర్తిగా డిన్నర్ తినకపోతే నేను ఆగలేను."

ఇన్నాళ్ళూ పోనీలే అని ఊరుకున్న శాస్త్రికి ఒక్కసారి ఉప్పెనలాగా కోపం ముంచుకొచ్చింది. గుడిలోపల అరుపులు వినిపిస్తే బాగోదు కనక 'ఇలా బయటకి రండి' అంటూ రాకేష్ ని గుడిలోంచి బయటకి తీసుకెళ్ళి తన కార్లో కూర్చోపెట్టి విసురుగా చెప్పాడు,

"మీకు నేను మొదట్లో చెప్పాను, అందరూ పట్టుకొచ్చిన ప్రసాదం కొంచెం ప్లేట్ లో పెట్టి ఇస్తారని. అయినా డిన్నర్ డిన్నర్ అంటూ గొడవ ఏమిటి? ఇక్కడ మీకు డిన్నర్ ఎందుకు పెట్టాలి అసలు. ఇది దేవుడి గుడి, రెస్టారెంట్ కాదు. ఎవరు ఏం ప్రసాదం పట్టుకొచ్చారో ఎవరికీ తెలియదు. మీకు అంతగా కావాలంటే పక్కనే ఉన్న వంటగదిలోకి వెళ్ళి అడగండి. మీరు గుడికి ఎందుకొచ్చారు అసలు?"

రాకేష్ మరోసారి చిలకపలుకులు అప్పగించాడు.

"రాత్రి డిన్నర్ లేకపోతే నేను భరించలేను. మీరు తెల్సినవారు కదా అని అడిగాను."

మండుకొచ్చిన శాస్త్రి అన్నాడు మరోసారి,

"మీరు చూడబోతే కుర్రాడిలా ఉన్నారు. మీకు డయాబెటిస్ ఉన్నట్టూ లేదు, ఒక ఏపిల్ లేదా అరటిపండు తిని పడుకుంటే ఏమీ అవదు కదా. దానికే డిన్నర్ డిన్నర్ అంటూ ఏడుస్తున్నారెందుకు? ఒక్కపూట భోజనం లేకపోతే ఏమౌతుంది? ముందు నుంచీ చెప్తూనే ఉన్నాను అందరూ పట్టుకొచ్చినవి పంచి పెడతారు అని. పూర్తి డిన్నర్ అంటూ ఈ ఏడుపు ఏమిటి? వాళ్ళు ప్రసాదం వితరణ చేస్తున్నప్పుడు పోనీ మీ దగ్గిరకి వచ్చేసరికి ఏదీ మిగలలేదు అనుకుందాం. మీరు దారిలో ఏ టాకో బెల్, మెక్డొనాల్డ్ అనేచోట ఆగి డిన్నర్ కొనుక్కోండి. ఈ మాత్రానికే ఏడుపు దేనికి? అయినా మీకు ఊరికే ఎందుకు పెట్టాలి ఎవరైనా? బుద్ధి అనేది ఉందా అసలు ఇలా అడగడానికి?"

కాసేపు మౌనంగా ఊరుకున్నాక శాస్త్రి రాకేష్ తో పాటు మళ్ళీ గుడిలోకి వచ్చాడు. రాకేష్ ఏమనుకున్నాడో తెలియదు కానీ మరోసారి శాస్త్రితో మాట్లాడలేదు ఆ రోజు. కానీ గుడినుంచి వెనక్కి వస్తూంటే భార్యతో చెప్పాడు శాస్త్రి జరిగిన సంగతి. ఆవిడకి ఇందులో సంబంధం లేదు కనక అప్పటికి ఊరుకుంది. ఆ రోజునుంచే రాకేష్, మిగతా తెలుగు వాళ్ళూ శాస్త్రితో మాట్లాడ్డం మానేసారు. దీనికి కొంచెం శాస్త్రి బాధపడినా ఈ దరిద్రం ఎప్పుడు వదులుతుందా అని మొదటినుండీ చూసిన వాళ్ళావిడ అంది, "పీడా పోయింది, ఊరుకోండి."

నీతి: గుడి ఏదైనా సరే లాభాపేక్ష లేని సంస్థ. లేకి మనుషుల కోసం పెట్టిన ఉచిత భోజన సత్రం కాదు.

Post your comments